సాక్షి తిరుపతి

శుక్రవారం ၊ 27 ၊ డిసెంబర్ ၊ 2024



## డీల్ కుదిర్చిన డాన్!

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో గనుల వ్యవహారం ఓ కొలిక్కి వచ్చింది. గనుల యజమానులు, ఓ డాన్ మధ్య డీల్ కుదిరింది. - 10లో



## పొర్లుకట్టలపై అడ్డుకట్టలు

ఇసుకాసురుల ఆగడాలకు అడ్డుకట్ట పడింది. తెగ్గొట్టిన స్వర్ణముఖినది పొర్లుకట్టకు అడ్డంగా అధికారులు గుంతలు తీశారు. - 10లో



## చందనాలంకరణలో చిద్విలాసం

రాపూరులోని పెంచలకోనలో లక్ష్మీనరసింహ స్వామి చందనాలంకరణలో చిద్విలాసంగా ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. - 10లో

## న్యూస్‌రీల్

### పశుగణన వేగవంతం చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

**తిరుపతి అర్బన్:** జిల్లా వ్యాప్తంగా పశుగణన ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పశువైద్య విభాగానికి చెందిన అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వికసిత్ భారత్ –2047 దిశగా జిల్లాలో పశుసంవర్థక శాఖ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పాడి రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులను అందించాలని చెప్పారు. మరో వైపు ఉపాధి పథకం ద్వారా బహు వార్షిక పశుగ్రాసాల పెంపకానికి, మినీ గోకులం షెడ్ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం పశువైద్య జిల్లా అధికారి రవికుమార్ మాట్లాడుతూ నవంబర్ 1 నుంచి ఇప్పటి వరకు 68 శాతం పశుగణన పూర్తి చేశామన్నారు. సమావేశంలో తిరుపతి డివిజన్ ఉపసంచాలకులు ఉమా మహేశ్వరితోపాటు జిల్లాలోని అన్ని ప్రాంతాలకు చెందిన పశువైద్య ఉద్యోగులు హాజరయ్యారు.

### ముంపులోనే వరి పొలాలు



నీట మునిగిన పొలాలు

**శ్రీకాళహస్తి రూరల్:** శ్రీకాళహస్తి మండలం, అమ్మపాళెంలో వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. అమ్మపాళెం కింద ఉండే చుక్కలనిడిగల్లు చెరువు గత పది రోజుల క్రితం కురిసిన వర్షాలకు పూర్తిగా నిండింది. ప్రస్తుతం కలుజు పారుతోంది. అయితే పైన కాలువల నుంచి అధిక నీరు వస్తుండడంతో నీరు అమ్మపాళెం వరకు ఎగదన్నింది. దీంతో పొలాలు నీటమునిగాయి. సుమారు 300 ఎకరాలు ముంపులోనే ఉన్నట్టు రైతులు చెబుతున్నారు. ఈ విషయమై నీటిపారుదలశాఖ ఏఈ రాఘవేంద్రరావును వివరణ కోరగా.. పొలాలు నీట మునిగిన విషయం తమ దృష్టికి రాలేదన్నారు. వెంటనే తమ సిబ్బందిని చెరువు వద్దకు పంపి పరిశీలిస్తామని చెప్పారు.

### డిగ్రీ పరీక్షల్లో ఐదుగురు డిబార్

**తిరుపతి సిటీ:** ఎస్వీయూ పరిధిలో గురువారం జరిగిన డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలలో ఐదుగురు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ డిబార్‌కు గురైనట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ మూడే దామ్లానాయక్ తెలిపారు. హైపవర్ ఇన్‌స్పెక్షన్ కమిటీ ఇచ్చిన సమాచారం మేరకు మదనపల్లి జోన్‌లోనే ఐదుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు వెల్లడించారు. అలాగే ఎస్వీయూ పరిధిలో ఈ ఏడాది మార్చిలో జరిగిన బీఫార్మసీ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను గురువారం విడుదల చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఫలితాల కోసం వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

### సంక్రాంతికి గుంతలు లేని రోడ్లు




మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

**తిరుపతి అర్బన్:** వచ్చే సంక్రాంతికి జిల్లావ్యాప్తంగా గుంతలు లేని రోడ్లు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. గురువారం కలెక్టరేట్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. రోడ్డు మరమ్మతులను వేగవంతం చేయాలని ఆదేశించారు. గుంతలు లేని రోడ్డే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన మిషన్ హోల్ ఫ్రీ (గుంతల రహిత ఆంధ్రప్రదేశ్) కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వివరించారు. నాణ్యమైన మెటీరియల్స్ వినియోగించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవే, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు హాజరయ్యారు.

### గంగమ్మ ఆలయంలో బహిరంగ వేలం రేపు

**తిరుపతి కల్చరల్:** శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఏడాది కాలం వివిధ పనుల లీజు నిమిత్తం ఈనెల 28న శనివారం హిందూ దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ జయకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది పాటు వెయ్యికళ్ల దుత్తల విక్రయం, సజీవ కోళ్ల సేకరణ, పాదరక్షలు భద్రపరిచి రుసుము వసూలు వంటి పనులకు లీజు హక్కు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు వివరాలకు ఆలయ పని వేళల్లో సంప్రదించవచ్చన్నారు.

‘ఓటేయండి తమ్ముళ్లూ!.. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచం. పైగా తగ్గిస్తాం. నేను గ్యారెంటీ!’.. అంటూ ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కూటమి ప్రభుత్వం మాటతప్పింది. రాష్ట్ర ప్రజలకు వరుసగా విద్యుత్ షాక్‌లు ఇస్తోంది. విద్యుత్ చార్జీల మోత మోగిస్తోంది. సూపర్ సిక్స్ హామీలను తుంగలో తొక్కినట్లుగానే విద్యుత్ చార్జీలపై చేసిన వాగ్దానాన్ని నట్టేట్లో వదిలేసింది. విద్యుత్ వాడకం తక్కువగా ఉండే శీతాకాలంలోనే బిల్లులు ఇలా పేలిపోతుంటే ముమ్ముందు నెలల్లో ఏ స్థాయిలో షాక్‌లు ఉంటాయోనని ప్రజానీకం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలో చంద్రబాబు ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలపై వైఎస్సార్‌సీపీ పోరుబాటకు సిద్ధమైంది. గురువారం జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, ఆందోళనలు చేపట్టనుంది. పెంచిన విద్యుత్ చార్జీలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ అధికారులకు వినతి పత్రాలను అందించనుంది.



# బాబు సర్దుపోటు!



ఈ ఫొటోలోని మహిళ పేరు వెంకటలక్ష్మి. తిరుపతి నగరంలో నివాసముంటోంది. అక్టోబర్‌లో 157 యూనిట్లకు రూ.839 కరెంటు బిల్లు వచ్చింది. నవంబర్‌లో 165 యూనిట్లకు రూ.885 వచ్చింది. అయితే డిసెంబర్‌లో వారి కుటుంబం 151 యూనిట్లను మాత్రమే వాడింది. దీనికి రూ.893 బిల్లు రావడంతో అవాక్కయ్యింది. విద్యుత్ వాడకం తక్కువైనా రూ.54కు పైగా ఎక్కువగా బిల్లు రావడంతో విద్యుత్ సిబ్బందిని నిలదీసింది. దీంతో రెండు రకాల సర్దుబాటు చార్జీలు బిల్లులో కలిపారని, అందువల్లే బిల్లు ఎక్కువగా వచ్చిందని సిబ్బంది చావు కబురు చల్లగా చెప్పారు. ఈ నెల వచ్చిన బిల్లులో 151 యూనిట్ల విద్యుత్ వాడకానికి అయిన బిల్లు రూ.573 మాత్రమే. అయితే వాటికి అదనంగా రూ.320 వివిధ చార్జీల రూపంలో దొడ్డిదారిలో వసూలు చేశారు. ఇందులో కొత్తగా ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో అక్టోబర్ 2024లో వాడిన విద్యుత్ యూనిట్లకు రూ.66 అదనంగా వడ్డించారు. 2022 ఏప్రిల్‌లో వాడిన విద్యుత్ యూనిట్లకు మరో రూ.89, ట్రూఅప్ చార్జీలు రూ.30, సర్ చార్జీ రూ.25, కస్టమర్ చార్జీలు రూ.50, ఫిక్స్‌డ్ చార్జీలు రూ.50, ఎలక్ట్రిసిటీ డ్యూటీ కింద మరో రూ.9 ఇలా... మొత్తంగా రూ.320ను అదనంగా మోపారు.

### జిల్లాలో పోరుబాట ఇలా..

కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నేతలు ధర్నాలు, నిరసనలు చేపట్టనున్నారు. వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో తిరుపతి నగరంలోని పద్మావతిపురం నుంచి ఎస్పీడీసీఎల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతి పత్రం సమర్పించనున్నారు.

- చంద్రగిరిలో నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని టవర్ క్లాక్ నుంచి ర్యాలీ నిర్వహించి ట్రాన్స్‌కో కార్యాలయానికి చేరుకుని వినతి పత్రం సమర్పించనున్నారు.
- శ్రీకాళహస్తిలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి విద్యుత్‌శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పిస్తారు.
- వెంకటగిరిలో నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి ట్రాన్స్‌కో కార్యాలయానికి చేరుకుని అధికారులకు వినతి పత్రం సమర్పిస్తారు.
- గూడూరులో ఎమ్మెల్సీ మెరుగ మురళీధర్ ఆధ్వర్యంలో విద్యుత్‌సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టనున్నారు.
- సూళ్లూరుపేట నియోజకవర్గం, నాయుడుపేటలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం అధికారులకు వినతి పత్రం సమర్పిస్తారు.
- సత్యవేడు నియోజకవర్గం నాగలాపురంలో ఆ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో ఏడీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు.

**చంద్రన్న షాక్!**

- జిల్లా ప్రజలపై భారీగా విద్యుత్ సర్దు'పోటు'
- ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో వడ్డన
- ప్రతి నెలా రూ.20 కోట్లు వసూలు
- గత రెండు నెలల్లోనే వేసిన భారం రూ.39.9 కోట్లు
- ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలపై బాబు గగ్గోలు
- ప్రజావంచనపై వైఎస్సార్‌సీపీ పోరుబాట
- నేడు జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు, ర్యాలీలు

**తిరుపతి రూరల్:** జిల్లా వాసులపై కూటమి ప్రభుత్వం రెండో సారి భారీగా విద్యుత్ చార్జీల భారం మోపింది. జిల్లాలో మొత్తం 6.8 లక్షలకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి నెలా రూ.20 కోట్ల ఇంధన సర్దుబాటు చార్జీలను ప్రభుత్వం ప్రజల నుంచి వసూలు చేసేందుకు శ్రీకారం చుట్టింది. ప్రతి యూనిట్‌కు 61 పైసలు చొప్పున అదనపు భారం మోపింది. 2022 ఏప్రిల్‌లో వాడిన విద్యుత్‌కు సంబంధించి ఇంధన సర్దుబాటు చార్జీల(ఎఫ్‌పీపీసీఏ) పేరుతో ఈ నెల నుంచి వసూలు ప్రారంభించింది. ఒక్కో యూనిట్‌కు రూ.1.21 చొప్పున వసూలు చేయాలని నిర్ణయించింది. అయితే ఇది ఎక్కువ మొత్తం అవుతోంది. బిల్లు భారీగా పెరిగే అవకాశం ఉండడం, ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తే అవకాశం ఉండడంతో కుటిల ప్రయత్నాలకు శ్రీకారం చుట్టింది. ఎఫ్‌పీపీసీఏ చార్జీలను రూ.1.21 ఒకేసారి కాకుండా, ఈ నెల 61 పైసలు, మరో నెల 60 పైసలు చొప్పున వసూలు చేసేలా దానిని విడగొట్టింది. దీంతో 2022 ఏప్రిల్‌లో వాడిన విద్యుత్‌కు సంబంధించి యూనిట్‌కు 61 పైసలు చొప్పున ఈ డిసెంబర్ బిల్లులో వినియోగదారులకు వచ్చింది. అంటే యూనిట్‌కు 61 పైసలు చొప్పున జిల్లా పరిధిలో ఈ నెల అదనంగా రూ.7 కోట్లకు పైగా భారం పడింది. తర్వాత నెల 60 పైసలు చొప్పున రూ.6.9 కోట్లు వసూలు చేయనుంది. మొత్తంగా ఎఫ్‌పీపీసీఏ ద్వారా జిల్లా ప్రజలపై రూ.13.9 కోట్ల భారం పడనుంది. 2024 అక్టోబర్ నుంచి వస్తున్న సర్దుబాటు చార్జీలకు ఇవి అదనం.

**ప్రతి నెలా సర్దు'పోటు'**

**ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ అడ్జస్‌మెంట్(ఎఫ్‌పీపీసీఏ)** కింద ఇప్పటికే జిల్లా ప్రజలపై కూటమి ప్రభుత్వం కోట్లల్లో భారం మోపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంధన సర్దుబాటు పేరుతో ప్రతి నెలా వడ్డనకు తెరలేపుతోంది. 2022 ఏప్రిల్ నెల ఎఫ్‌పీపీసీఏ చార్జీలకు తోడుగా అక్టోబర్ నుంచి ఏ నెలకు ఆ నెల సర్దుబాటు పేరుతో యూనిట్‌కు 91 పైసలు చొప్పున వడ్డిస్తోంది. ఇలా ప్రతి నెలా దాదాపు రూ.13 కోట్లను వసూలు చేస్తున్నట్లు విద్యుత్ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇలా గత రెండు నెలల్లోనే జిల్లా వాసులపై దాదాపు రూ.26 కోట్ల భారం వేశారు. ఎఫ్‌పీపీసీఏ రెండు రకాల చార్జీల ద్వారా రూ.13.9 కోట్లు, రూ.26 కోట్లు చొప్పున ఇప్పటికే రూ.39.9 కోట్ల మేర వసూలు చేశారు.

**ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం**

విద్యుత్ చార్జీలను పెంచుతున్న కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలపై వైఎస్సార్‌సీపీ ప్రజాపోరుబాట చేపట్టనుంది. రూ.15 వేల కోట్లకు పైగా ప్రజలపై మోపిన విద్యుత్ భారాన్ని వెనక్కి తీసుకోవాలని, ఎన్నికల హామీ మేరకు విద్యుత్ చార్జీల పెంపును నిలిపివేయాలని, ఎస్సీ, ఎస్టీ, పేదలకు అందిస్తున్న విద్యుత్ సబ్సిడీలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిరసన ర్యాలీలు, ఆందోళనలు, ధర్నాలు చేపట్టనుంది. ప్రభుత్వ ప్రజావ్యతిరేక చర్యలను ఖండించనుంది. అనంతరం విద్యుత్ అధికారులకు ఆ మేరకు వినతి పత్రాలను అందించనున్నారు. ఇప్పటికే తిరుపతి, చిత్తూరు జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లకు ఆదేశాలు జారీచేశారు. ఈ ప్రజాపోరుబాట కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొననున్నారు.

**సంపద సృష్టి అంటే ఇదేనా బాబు?**



ఎన్నికల ముందు సంపద సృష్టిస్తాను అంటే ప్రజలు నమ్మి ఓటు వేశారు. సంపద సృష్టి అంటే ప్రజలపై భారం వేయడమా..? గతంలోకంటే విద్యుత్ చార్జీలు పెరిగాయి. కరెంటు చార్జీలు పెంచబోమని చంద్రబాబు ఎన్నికల ముందు చెప్పారు. ఇప్పుడేమో ఇలా బాదేస్తున్నారు. కరెంటు బాదుడు వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. –తులసిరాజాన్, రేణిగుంట

## తిరుపతితో సింగ్‌కు విడదీయలేని బంధం



2012లో శ్రీహరికోటను సందర్శించిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ (ఫైల్)

**తిరుపతి సిటీ:** మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ పలుమార్లు తిరుపతి జిల్లాలో పర్యటించారు. 2010 సెప్టెంబర్ ఒకటవ తేదీన మన్మోహన్ సింగ్ తిరుమలకు విచ్చేశారు. పద్మావతి అతిథి గృహంలో విశ్రాంతి అనంతరం సెప్టెంబర్ 2వ తేదీన శ్రీవారి సేవలో తరించారు. అనంతరం అదే రోజు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి పునాది వేశారు. అలాగే శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్‌ను పలుమార్లు సందర్శించారు. 2012 సెప్టెంబర్ 9న పీఎస్‌ఎల్‌వీ–సీ21 ప్రయోగానికి హాజరయ్యారు. ఆయన మరణ వార్త విన్న జిల్లా ప్రజలు, అధికారులు శోకతప్త హృదయంతో మునిగిపోయారు.



తిరుమల ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న మాజీ పీఎం డాక్టర్ మన్మోహన్ సింగ్ (ఫైల్)

### నేడు ఎస్వీయూలో అంతర్జాతీయ సదస్సు

**తిరుపతి సిటీ:** ఎస్వీయూ బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో సెనెట్ హాల్‌లో శుక్రవారం బయోటెక్నాలజీ, మెడిసిన్ అండ్ క్యాన్సర్ తెరపాటిక్స్ అనే అంశంపై మూడు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు సదస్సు సంచాలకులు ప్రొఫెసర్ సరిత తెలిపారు.



## పార్టీకి పూర్వ వైభవం తీసుకొద్దాం

- నగరి వేదికగా వైఎస్సార్ సీపీ శ్రేణులకు నేతల దిశానిర్దేశం



నగరిలో దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి, ఎంపీ గురుమూర్తి, మాజీ మంత్రి ఆర్కే రోజా, మాజీ ఎంపీ రెడ్డెప్ప

**నగరి :** పార్టీకి మళ్లీ పునర్వైభవం తీసుకువద్దామని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ఏజేఎస్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అంటే అల్లాటప్ప పార్టీ కాదన్నారు. నిఖార్సయిన పార్టీ అని, వేధింపులకు భయపడని పార్టీ అని అన్నారు. పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి లాంటి నాయకుడు ప్రపంచ రాజకీయాల్లో ఎక్కడా లేరని, ఎందెందు వెదికినా దొరకరన్నారు. ఇది మాటల కోసం చెప్పే విషయం కాదని, అది ఆయన స్వయంగా నిరూపించుకున్నారన్నారు. అలాంటి నాయకుడి వద్ద మనం పనిచేస్తున్నామంటే భయం మన దరిదాపుల్లోకి కూడా రాకూడదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన ఆరునెలలకే ప్రజల్లో తేలిపోయిందన్నారు. 2 లక్షల కోట్లయ్యే హామీలిచ్చి జగనన్న అమలు చేసిన పథకాలు కూడా ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వమన్నారు. పెళ్లైన తరువాత పారాణి ఎండిపోయినట్లు టీడీపీ అధికార పారాణి ఆరు నెలలకే ఎండిపోయిందన్నారు. దానికి ఇక మనుగడ లేదన్నారు. కూకటి వేళ్లతో పీకేసే రోజు త్వరలో ఉందన్నారు.

**ఆశలపల్లకీ నరకపు వాకిలి చూపుతోంది**

ఎన్నికల ముందు పచ్చనేతలు సూపర్‌సిక్స్ అంటూ చూపిన ఆశలపల్లకీలో జనం ఎక్కేశారని అయితే ఆ పల్లకీ ఇప్పుడు వారికి నరకపు వాకిలి చూపుతోందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్కేరోజా ఎద్దేవా చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తప్పులు చేసి ఓడిపోలేదని, తప్పుడు ప్రచారంతో ఓటమి పాలైందన్నారు. ఎన్నికల ముందు అరచేతిలో వైకుంఠం చూపిన చంద్రబాబు అధికార నరకం చూపుతున్నారని అన్నారు. ఆరు నెలల్లో ఆలీబాబా అరడజను దొంగల్లా రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. జగనన్న పాలనలో ప్రతి సంక్షేమ పథకం తలుపు తట్టి మరీ పేదల దరిచేరేదని, నేడు ఏ సంక్షేమం ప్రజలకు చేరడం లేదన్నారు. సంపద సృష్టిస్తానని పలికి నేడు అప్పులపై అప్పులు చేస్తున్నారని మండిపడ్డారు. నాడు విద్యాంధ్రప్రదేశ్‌గా ఉన్న రాష్ట్రం నేడు మద్యాంధ్రప్రదేశ్ అయ్యిందన్నారు. జగన్ ఓడించే వరకు ఉద్యోగులు కంకణం కట్టుకున్నారని, నేడు ఎందుకు చంద్రబాబును గెలిపించామా? అని వారు బాధపడే పరిస్థితి ఎదురైందన్నారు. కేసులు పెడతాం, ఉద్యోగం తీసేస్తాం అంటూ కూటమి ప్రభుత్వం భయపెట్టి లొంగదీసుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. నగరి నియోజకవర్గంలో తాను, జిల్లాలో కరుణాకరరెడ్డన్న, రాష్ట్రంలో జగనన్న మీకు అండగా ఉంటామన్నారు. బిజినెస్ మెన్, ఫ్యామిలీ మెన్‌గా, పొలిటికల్ మెన్‌గా విజయం సాధించిన వ్యక్తి జగనన్న అని అలాంటి నాయకుని గొడుగు కింద మనమున్నామన్నారు.

**రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం**

కూటమి ప్రభుత్వం వచ్చాక అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కన పెట్టి లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని తిరుపతి ఎంపీ గురుమూర్తి అన్నారు. కూటమి బెదిరింపులకు బెదరాల్సిన అవసరం లేదన్నారు. జగనన్న కోసం పొరాడే వారికి పార్టీలో సముచిత స్థానం, ప్రాధాన్యత ఉంటుందన్నారు. మనం ఒకరికొకరు తోడు కావాలన్నారు. ఏ ఒక్కరికి కష్టం వచ్చినా మేమంతా అండగా ఉంటామన్నారు.

## క్లుప్తంగా

### జిల్లాకు చేరిన 144 ట్రాన్స్‌ఫార్మర్లు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్టోర్స్‌కు విద్యుత్ పరికరాలు వచ్చాయని ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్ తెలిపారు. వ్యవసాయ సర్వీసులకు వినియోగించే 25 కేవీ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లు 144 వచ్చాయన్నారు. వీటితో పాటు బ్రేకర్స్ 9 వచ్చాయని, వీటిని సీనియార్టీ ప్రకారం రైతులకు ఇవ్వాలని ఆదేశించారు. ఏఈలు వర్క్‌ఆర్డర్లు పెట్టి మెటీరియల్స్ డ్రా చేసుకోవాలని సూచించారు.

### ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

– డ్రైవర్ మృతి



లారీలో ఇరుక్కుపోయి మృతి చెందిన రాజా

దొరవారిసత్రం: రోడ్డుపై ఆగి ఉన్న లారీని అటుగా వస్తున్న మరో లారీ ఢీకొనడంతో లారీ డ్రైవర్ రాజా(26) మృతి చెందిన ఘటన బుధవారం అర్ధరాత్రి కృష్ణాపురం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల కథనం మేరకు వివరాలు.. గుజరాత్ నుంచి చెన్నైకి బత్తాయి లోడ్‌తో వెళ్తున్న లారీ కృష్ణాపురం గ్రామ సమీపంలో రోడ్డుపై మరమ్మతులకు గురై ఆగి ఉన్న మరో లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి డ్రైవర్‌ను వెలికితీసి 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నాయుడుపేటకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. గురువారం రాజా మృత దేహాన్నికి పోస్టు మార్టం నిర్వహించారు. ఎస్ఐ అజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

చిత్తూరు అర్బన్: నగరంలో ప్రేమజంట గురువారం విషం తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. టూటౌన్ సీఐ నెట్టికంటయ్య కథనం.. చంద్రగిరి మండలానికి చెందిన జి భరత్ (21), కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన రాజేశ్వరి (19) తిరుపతి రెడ్డికాలనీలోని యూవీ కార్డికేర్ హాస్పిటల్‌లో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో వీరిద్దరూ ప్రేమలో పడ్డారు. ఇంట్లో తెలియకుండా గురువారం చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. సాయంత్రం చిత్తూరు నగరం రామ్‌నగర్ కాలనీలోని తన స్నేహితుల వద్దకు వచ్చారు. వాళ్ల ఫోన్ తీయకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై వెంట తెచ్చుకున్న విషం తాగేశారు. స్థానికులు ఆ జంటను చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

# డీల్ కుదిర్చిన డాన్!

- మైకా.. పల్స్‌ఫర్ ఖనిజం యజమానులే విక్రయించుకోవచ్చు
- మైకా క్వార్ట్జ్, క్వార్ట్జ్ ఖనిజం మాత్రం మైనింగ్ డాన్‌కే!
- మొన్న 4.. నిన్న 9.. నేడో రేపో 10 గనులకు అనుమతులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో గనుల వ్యవహారం ఓ కొలిక్కివస్తోంది. మైనింగ్ డాన్, మైనింగ్ యజమానుల మధ్య డీల్ కుదిరింది. దీంతో మైనింగ్ ఆపరేషన్ పనులు చేసుకునేందుకు అనుమతులను విడతల వారీగా మంజూరు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే ఆ డాన్ అనుమతితో శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో నాలుగు గనులకు అనుమతులు మంజూరు చేసిన విషయం తెల్సిందే. అలాగే గత మంగళవారం 9 గనులకు అనుమతులు మంజూరు చేశారు. అవి కూడా ఇద్దరికి చెందినవే కావడం విశేషం. గురువారం లేదా శుక్రవారం కొన్ని ఫ్యాక్టరీలతో పాటు గనులు కలిపి మొత్తం 10 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేయనున్నట్టు సమాచారం. డీల్ కూడా మైకా, పల్స్ ఫర్ ఖనిజం గని యాజమానులే విక్రయించుకోవాలని, తమకు మాత్రం క్వార్ట్జ్, మైకా క్వార్ట్జ్ ఖనిజం ఇవ్వాలంటూ మైకా డాన్ హుకుం జారీచేసినట్లు తెలుస్తోంది. అందుకు మైనింగ్ యజమానులు కూడా ఒప్పుకున్నట్లు సమాచారం.

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో భూగర్భ గనులు 7 కాగా 140 మైకా, క్వార్ట్జ్‌గనులతో పాటు గూడూరులో 75 సిలికా ఇసుక గనులున్నాయి. వీటిపై వివిధ పరిశ్రమలతో కలిపి మరో వందకు పైగా నడుస్తున్నాయి. ఈ యూనిట్లు అన్నీ ఇక్కడ లభించే ముడి ఖనిజంపై



మైకా గనుల్లో ప్రత్యామ్నాయ పరిశ్రమ

ఆధారపడుతున్నాయి. పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మంది కూలీలు జీవిస్తున్నారు.

**అడ్డదిడ్డంగా అనుమతులు**

మొన్న 4 గనులకు అనుమతులు మంజూరు చేశారు. నిన్న 9 గనులకు అనుమతులు ఇవ్వగా నేడో రేపో మరో 10 పరిశ్రలకు కూడా అనుమతులు మంజూరు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో గనులకు ఎలాంటి నోటీసులు లేకుండా, జరిమానాలను విధించకుండా ఉన్న గనులకు అనుమతులు మంజూరు చేస్తున్నట్లు అధికారికంగా తెలిసింది. ఈ క్రమంలో కోర్టు వివాదం ఉన్నా కూడా ఓ గనికి అనుమతులు ఎలా మంజూరు చేశారనేది అంతుపట్టని విధంగా ఉంది.

**క్వార్ట్జ్, మైకా క్వార్ట్జ్ డాన్‌కే!**

క్వార్ట్జ్, మైకా క్వార్ట్జ్ నిజంపై మైనింగ్ డాన్ కన్నుపడింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్త పాలసీ అమలు చేస్తామంటూ కాలయాపన చేసి ఏడు నెలలుగా గనులన్నీ మూసివేశారు. ఈ నేపథ్యంలో మైనింగ్ వ్యవహారం అంతా రాష్ట్ర పెద్దలు ఓ మైనింగ్ డాన్‌కు అప్పగించేశారు. ఆ డాన్ విధించిన షరతులకు యజమానులు అంగీకరించినట్లు తెలుస్తోంది. అందులో భాగంగా క్వార్ట్జ్, మైకా క్వార్ట్జ్ ఖనిజం సదరు డాన్‌కే విక్రయించే విధంగా డీల్ కుదిరినట్టు సమాచారం. పల్స్ ఫర్, మైకా మాత్రం సంబంధింత యజమానులే అమ్ముకునేలా డీల్ కుదిరింది. ఆ రెండు ఖనిజాలకు కూడా ఎంతో కొంత మైనింగ్ డాన్‌కు ముట్టజెప్పే విధంగా రహస్యంగా డీల్ కుదిరిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఏడు నెలల్లో రూ.105 కోట్ల నష్టం**

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మైనింగ్ పరిశ్రమపై రాయల్టీ రూపంలోనే ప్రతి నెలా రూ.15 కోట్ల వరకు మైనింగ్ పరిశ్రమ నుంచి ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. గడిచిన ఏడు నెలలుగా నెలకు రూ.15 కోట్ల వంతున రూ.105 కోట్లు ప్రభుత్వానికి రాకుండా పోయింది. ఇప్పుడు మూసి ఉన్న గనులకు అనుమతులు మంజూరు చేస్తుండడంతో కార్మికులకు కొంత ఊరట లభిస్తోంది. మైనింగ్ నిబంధనలు పాటిస్తారో లేక మైనింగ్ డాన్ చెప్పిన విధంగానే మైనింగ్ వ్యవహారాలు కొనసాగిస్తారో వేచి చూడాల్సి ఉంది.



అపారమైన క్వార్ట్జ్ ఖనిజం



విపరీతమైన డిమాండ్ ఉన్న మైక్యా క్వార్ట్జ్ ఖనిజం

### ఆస్తి తగాదాలో రాజకీయ జోక్యం ఏంటి?

- మండిపడ్డ వైఎస్సార్‌సీపీ నాయకులు



సమావేశంలో అంజూరు తారక శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నేతలు, బోనుపల్లి గ్రామస్థులు

శ్రీకాళహస్తి : కుటుంబ ఆస్తి తగాదాల్లో ఓ ఆడబిడ్డను అడ్డం పెట్టుకుని రాజకీయం చేయాలని చూడడం టీడీపీ నాయకులకు తగదని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాయకులు, బోనుపల్లి గ్రామస్తుల ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ.. మితిమీరిన రాజకీయ వేధింపులతోనే బోనుపల్లి గ్రామంలో ముని సుబ్రహ్మణ్యం మరణించాడని ఆరోపించారు. ఈ సందర్భంగా బోనుపల్లి గ్రామస్తుడు ఆనంద్ మాట్లాడుతూ.. తన సోదరుడి చావుకు కారణం టీడీపీ నాయకులేనని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్‌స్టేషన్‌లో తనను, తన కుటుంబ సభ్యులను కూర్చోబెట్టి గ్రామంలోకి వెళ్లొద్దని వేధించారని, వెళ్తే కేసులు పెడుతామని బెదిరించారని తెలిపారు. తన సోదరుడిని ఇల్లు ఖాళీ చేయాలని మానసికంగా ఇబ్బంది పెట్టడం వల్లే చనిపోయి ఉంటాడని భావిస్తున్నామన్నారు. ఆలయ మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఆడ బిడ్డను అడ్డం పెట్టుకుని టీడీపీ నాయకులు రాజకీయం చేస్తున్నారని, ఆమె భర్త చనిపోయాడని, వీలైతే ఉద్యోగం ఇవ్వాలన్నారు. వాసునాయుడు మాట్లాడుతూ.. ఎన్నికల వరకే రాజకీయాలని, గ్రామాల్లో చిచ్చుపెట్టడం మంచిది కాదన్నారు.

## ప్రారంభమైన ఫ్లెమింగో ఫెస్టివల్ పనులు



మైదానాన్ని చదును చేసిన దృశ్యం

సూళ్లూరుపేట: ఫ్లెమింగో ఫెస్టివల్ పనులు ప్రారంభమయ్యాయి. సూళ్లూరుపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని గురువారం చదును చేశారు. మైదానంలో పిచ్చి మొక్కలను తొలగించి చెత్తా చెదారాన్ని బయటకు తరలించారు. ఈ మైదానంలో డిపార్ట్‌మెంట్స్‌కు సంబంధించిన ఎగ్జిబిషన్ స్టాల్స్, ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు వేదికను ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం, అటకానితిప్ప పర్యావరణ విజ్ఞానకేంద్రం, భీములవారిపాళెం పడవల రేవు వద్ద కూడా పనులను ప్రారంభించారు. అయితే ఫెస్టివల్ తేదీలను నిర్ణయించడంలో ఇంకా సందిగ్ధత నెలకొంది. ముందుగానేమో 10, 11, 12 అని ప్రకటించారు. మళ్లీ 17, 18, 19 అంటున్నారు. ఇంకా తేదీలను ఖరారు చేయడంలో మలగుల్లాలు పడుతున్నారు. తేదీల ప్రకటన విషయంలో ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది.

## చందనాలంకరణలో చిద్విలాసం



పెంచలకోనలో బంగారు గరుడ వాహనంపై ఆశీనులైన లక్ష్మీనరసింహస్వామి

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి చందనాలంకరణలో భక్తులకు అభయమిచ్చారు. గురువారం స్వాతి నక్షత్రం శ్రీవారి జన్మనక్షత్రం కావడంతో స్వామివారి మూలమూర్తికి చందనంతో అలంకరించినట్టు ఆలయ ప్రధాన అర్చకులు తెలిపారు. ఉదయం అభిషేకం, చందనాలంకరణ, 9 గంటలకు శ్రీవారి నిత్య కల్యాణ మండపంలో శాంతి హోమం, 11 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణం, మధ్యాహ్నం ఒంటిగంటకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి అత్యంత ప్రియమైన బంగారు గరుడ వాహనంపై కొలువుదీరి లక్ష్మీనరసింహస్వామి మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

## విద్యార్థినికి ఆర్థిక సహాయం

పాకాల : మండలంలోని దామలచెరువు ప్రాథమిక పాఠశాలలో అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థిని తస్లీమ్‌కు ఎంఈఓ బాబ్జి చేతుల మీదుగా ఆర్థిక సాయం అందజేశారు. 5వ తరగతి చదువుతున్న విద్యార్థిని తస్లీమ్‌కు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు గ్రామపెద్ద కే.అహ్మద్‌బాషా కలిసి గురువారం రూ.10,560 ఆరోగ్య ఖర్చుల నిమిత్తం అందజేశారు. ఈ విరాళాన్ని ఎంఈఓ చేతులమీదుగా విద్యార్థిని తల్లిదండ్రులకు అందించారు. ఎంఈఓ మాట్లాడుతూ చిన్న వయసులోనే అనారోగ్య సమస్యలు రావడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయమోహన్ రెడ్డెప్ప, యూటీఎఫ్ నాయకులు పత్తిపాటి రమేష్‌నాయుడు, ఉపాధ్యాయులు చిన్నస్వామి, లక్ష్మీదేవి, ప్రమీలమ్మ, సయ్యద్‌ఖాజా యూసుఫ్, సీఆర్పీ శ్రీనివాసులు, విద్యార్థిని తల్లిదండ్రులు ఎస్.మస్తాన్, ఎస్.నస్రీన్ పాల్గొన్నారు.



విద్యార్థినికి ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న ఎంఈఓ బాబ్జి, ఉపాధ్యాయులు

## తిరుమలకు కాలి నడకన పీవీ సింధు దంపతులు

తిరుమల: బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు దంపతులు అలిపిరి మెట్ల మార్గం నుంచి కాలి నడకన గురువారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. ఇటీవల హైదరాబాదుకు చెందిన పారిశ్రామికవేత్త వెంకటదత్తసాయితో ఆమెకు వివాహం అయ్యింది. ఈ నేపథ్యంలో శ్రీవారి దర్శనార్థం ఆమె తన భర్త, కుటుంబ సభ్యులతో కలసి కాలినడకన తిరుమల చేరుకున్నారు. శుక్రవారం బ్రేక్ దర్శన సమయంలో ఆమె శ్రీవారిని దర్శించుకోనున్నారు.



కాలినడకన తిరుమలకు చేరుకున్న పీవీ సింధు దంపతులు

## అమ్మవారి సేవలో ప్రముఖులు

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని గురువారం తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్.రవి కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులతో తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్.రవి

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



పూర్ణిమ



లక్ష్మీలావణ్య



వరలక్ష్మి



కుసుమ

తిరుపతి సిటీ: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వికసిత్ భారత్ –2047లో భాగంగా రాష్ట్రంలోని అన్ని వర్సిటీలలో విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని, నూతన ఆలోచనలను ప్రోత్సహించేందుకు క్విజ్, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈనెల 30వ తేదీన నాగార్జున యూనివర్సిటీలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎస్వీయూ ఫిజిక్స్ విభాగం నుంచి పూర్ణిమ, లక్ష్మీలావణ్య, వరలక్ష్మి, కుసుమ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి, ఫిజిక్స్ హెడ్ ప్రొఫెసర్ దేవప్రసాద్‌రాజు బెస్ట్ ఆఫ్ లక్ చెబుతూ అభినందించారు.

## నేడు రాష్ట్ర స్థాయి డ్రాగన్ బోట్ పోటీలు

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువులో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, కెనాయింగ్, కయాకింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 13వ జాతీయ డ్రాగన్ బోట్ చాంపియన్‌షిప్ పోటీలలో భాగంగా శుక్రవారం నుంచి రాష్ట్ర స్థాయి డ్రాగన్ బోట్ పోటీలు నిర్వహించనున్నట్లు శాప్ చైర్మన్ రవినాయుడు తెలిపారు. గురువారం రాయలచెరువులో జరగనున్న డ్రాగన్ బోట్ పోటీల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నేటి నుంచి ఈనెల 31వ తేదీ వరకు సీనియర్స్ విభాగం క్రీడాకారులకు పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారిని జాతీయ క్రీడలకు ఎంపిక చేస్తామన్నారు. కెనాయింగ్, కయాకింగ్ అసోసియేషన్ చైర్మన్ ప్రదీప్ నాయుడు మాట్లాడుతూ ఈ పోటీలలో గుంటూరు, కర్నూలు, విశాఖపట్టణం, విజయవాడ జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న శాప్ చైర్మన్

## మన్నూరు ఘర్షణపై విచారణ

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లి మండలం, మన్నూరు గ్రామంలో రెండు వర్గాల మధ్య బుధవారం జరిగిన ఘర్షణపై గూడూరు డీఎస్పీ వీవీ.రమణ గురువారం విచారణ చేపట్టారు. వివాదానికి గల కారణాలను ఇరువర్గాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐ గోపి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



విచారణ చేపడుతున్న గూడూరు డీఎస్పీ రమణ

## శ్మశానం ఆక్రమించి.. పార్కును చెరబట్టి!

- యథేచ్ఛగా ఆక్రమణలు
- గతంలో తొలగించిన రెవెన్యూ
- కూటమి అధికారంలోకి వచ్చాక మళ్లీ ఆక్రమణలు
- పట్టించుకోని రెవెన్యూ, తుడా అధికారులు

తిరుపతి రూరల్: పార్కు స్థలం కబ్జా చేశారు. దానికి ఆనుకుని ఉన్న శ్మశానాన్ని సైతం చెరబట్టారు. వాటాలు వేసుకుని మరీ పంచుకున్నారు. పంచుకున్న దానిలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. గతంలో ఈ బరితెగింపును రెవెన్యూ, తుడా అధికారులు అడ్డుకున్నారు. ఆక్రమణలను తొలగించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమ్ముళ్లు రెచ్చిపోతున్నారు. శ్మశానం, తుడా పార్కు కబ్జాలకు పూర్వవైభవం తీసుకొస్తానని రామాపురానికి చెందిన ఓ చోటా 'భారీ' హామీ ఇవ్వడంతో తొలగించిన ఆక్రమణలను మళ్లీ నిర్మించడం మొదలు పెట్టారు.

**భవనాలు, షెడ్ల నిర్మాణం**

అవిలాల రెవెన్యూ లెక్కదాఖల సర్వే నం.481లో 1.9 ఎకరాలు, 486లో 1.78 ఎకరాలు మొత్తం 3.68 ఎకరాలు కాలువ పోరంబోకు స్థలం ఉంది. ఇందులో మూడు రజక సంఘాలకు సంబంధించి 50 సెంట్ల చొప్పున 1.5 ఎకరాలను మూడు ధోబీఘాట్లకు కేటాయించారు. మిగిలిన స్థలాన్ని అవిలాల గ్రామానికి సంబంధించి శ్మశానంగా ఉపయోగిస్తున్నారు. పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న విలువైన ఈ శ్మశానంపై కబ్జారాయుళ్ల కన్నుపడింది. అంకణం రూ.2 లక్షలకు పైగా పలుకుతున్న ఈ స్థలం ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం దాదాపు రూ.15 కోట్లకు పైగా పలుకుతోంది. గతంలో శ్మశానాన్ని ఆక్రమించుకోవాలని కొందరు ప్రయత్నించారు. కానీ రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణలను పూర్తిగా తొలగించారు. ప్రస్తుతం శ్మశానాన్ని ఆక్రమించి నాలుగు షెడ్లను నిర్మిస్తున్నారు. స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆరోపిస్తున్నారు.

**తుడా పార్కు కబ్జా చేసి..**

అవిలాల శ్మశాన స్థలానికి అనుకుని రెండు దశాబ్దాల క్రితం ఎంజీ బ్రదర్స్, మరికొందరు రియాల్టర్లు కలిసి లేఅవుట్ వేశారు. అందులో దాదాపు 75 సెంట్లను పార్కు స్థలంగా చూపించారు. అయితే ఈ పార్కును కొందరు ఆక్రమిస్తున్నారు. పెద్ద పెద్ద భవంతులను నిర్మిస్తున్నారు. గతంలో పార్కులోని ఆక్రమణలను తుడా, పంచాయతీ, రెవెన్యూ అధికారులు తొలగించారు. అయితే రామచంద్రాపురం మండలం సీరామాపురానికి చెందిన ఓ చోటా నేత నియోజకవర్గ ముఖ్యనేతతో మాట్లాడాను, కబ్జాలకు పూర్వ వైభవం తీసుకువస్తానని భారీ ప్యాకేజీ తీసుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం పార్కుతో పాటు దానికి అనుకుని ఉన్న శ్మశానాన్ని సైతం ఆక్రమించి అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారు.



పార్కు, శ్మశానాన్ని ఆక్రమించి నిర్మించిన షెడ్లు



పార్కును ఆక్రమించి నిర్మిస్తున్న భవంతులు

**ఆక్రమణలను తొలగిస్తాం**

కాలువ పొరంబోకు భూమిలో ఆక్రమణలు మా దృష్టికి రాలేదు. పరిశీలించి వాటిని తొలగిస్తాం.

– రామాంజనేయులునాయక్, తహసీల్దార్, తిరుపతి రూరల్

## స్వర్ణముఖి పొర్లుకట్టలపై అడ్డుకట్టలు

సాక్షి ఎఫెక్ట్..

నాయుడుపేట టౌన్: ఇసుకాసురులకు అడ్డుకట్ట వేసేందుకు స్వర్ణముఖి నది పొర్లుకట్టలపై అడ్డుకట్టలేసినట్టు తహసీల్దార్ మాగర్ల రాజేంద్ర తెలిపారు. గురువారం 'సాక్షి' ఇసుకాసురుల ఆగడాలపై 'పొర్లు కట్టలు తెగ్గొట్టి.. స్వర్ణమ్మను చెరబట్టి' శీర్షికన వార్త వెలువడింది. దీనిపై రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు స్పందించారు. మండల పరిధిలోని పలు చోట్ల ధ్వంసం చేసిన స్వర్ణముఖి నది పొర్లుకట్టలను పరిశీలించారు. పొర్లుకట్టల వద్ద అడ్డుకట్టలతో పాటు ట్రాక్టర్లు నదిలోకి దిగకుండా భారీగా గుంతలు తవ్వారు. అయ్యప్పరెడ్డిపాళెం, మిట్టపాళెం, మిట్టపాళెం దళితవాడ, మూర్తిరెడ్డిపాళెం గ్రామాల్లో మొత్తం ఐదు చోట్ల వాహనాలు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు, మైనింగ్ అధికారి సుబ్బారాయులు పాల్గొన్నారు.



అయ్యప్పరెడ్డిపాళెం వద్ద అడ్డుకట్టలు వేస్తున్న అధికారులు

## సండే అయినా ఉండాల్సిందే..!



తిరుపతి రూరల్: ఆదివారమైనా శిక్షణకు రావాల్సిందేనని అధికారులు స్పష్టం చేశారు. వెరిటాస్ సైనిక్ స్కూల్, మెడ్‌జీలో టీచర్లకు లీడర్‌షిప్‌పై 6వ విడత రెసిడెన్షియల్ శిక్షణ గురువారం ప్రారంభమైంది. 6రోజుల పాటు వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు అధికారులు చెప్పారు. తిరుపతి, అన్నమయ్య, నెల్లూరు జిల్లాలకు చెందిన హెడ్మాస్టర్లు, ఎంఈఓ లు, టీచర్లు హాజరయ్యారు. తాము గుండె సంబంధిత సమస్యలతో బాధ పడుతున్నామని ఇద్దరు టీచర్లు శిక్షణ నుంచి మినహాయింపు పొంది వెళ్లిపోయారు.